క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.50 వేల విరాళం



తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో ఉన్న వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి భక్తుడు రూ.50,116 అందజేసినట్లు ఆలయ ఏసీ దాసరి శ్రీరామవరప్రసాదరావు శుక్రవారం తెలిపారు. సికింద్రాబాద్‌కు చెందిన మాదాల చెన్నకేశవరావు దంపతులు పై విరాళాన్ని అందించారన్నారు. వారికి స్వామి వారి శేష వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో చైర్మన్ రాధాసుబ్రహ్మణ్యం, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వెలగపూడి లక్ష్మణదత్ విగ్రహావిష్కరణ



ముక్త్యాల(జగ్గయ్యపేట): కేసీపీ సంస్థల అభివృద్ధికి దివంగత వెలగపూడి లక్ష్మణదత్ ఎంతో కృషి చేశారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. గ్రామంలోని కేసీపీ కర్మాగారంలో వెలగపూడి లక్ష్మణదత్ విగ్రహాన్ని సంస్థ ఎండీ ఇందిరాదత్‌తో కలిసి శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేసీపీ సంస్థ దత్తత గ్రామాల అభివృద్ధికి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి నెట్టెం రఘురాం, మాజీ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, కేసీపీ ప్రతినిధి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కేసులు



జగ్గయ్యపేట: లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే సీజ్ చేస్తామని పట్టణ ఎస్ఐ రామారావు అన్నారు. పాత మున్సిపల్ సెంటర్‌లో శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రిబుల్ రైడింగ్, వాహనాలు నడుపుతూ సెల్‌ఫోన్ మాట్లాడే వారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ద్విచక్ర వాహనదారులు రవాణా శాఖ నిబంధనలు పాటించాలని, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే జరిమానా విధిస్తామని తెలిపారు. మైనర్‌లకు వాహనాలు ఇస్తున్నారని, వారు పట్టుబడితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం 25 మందిపై కేసు నమోదు చేశారు.

నేడు విద్యుత్ నిలిపివేత

నందిగామ: నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లో శనివారం విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో 6 గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విజయవాడ రూరల్ ఈఈ జీవీ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 132 కేవీ లైన్ మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేనున్నట్లు పేర్కొన్నారు. అన్ని సెక్షన్ల పరిధిలో ఆ సమయంలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నాణ్యమైన భోజనం అందించాలి



కంచికచర్ల: మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని లేకపోతే వంట ఏజెన్సీ నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని ఎంఈఓ ఎల్.చిట్టిబాబు హెచ్చరించారు. మండలంలోని పరిటాల, నక్కలంపేట ఎంపీపీ స్కూళ్లో శుక్రవారం మధ్యాహ్న భోజన పథకం పరిశీలించారు. ఈ మేరకు ఎంఈఓ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నారని చెప్పారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని లేకపోతే చర్యలు తీసుకుంటాని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలసి భోజనం చేశారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. హెచ్ఎం మాధవి, ఉపాధ్యాయులు జాన్సీ, సీఆర్పీ కిరణ్‌కుమార్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే జగనన్న ధ్యేయం

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు

కంచికచర్ల: రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపి ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు తెలిపారు. మండలంలోని పరిటాల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించడంతోపాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందుతున్న తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే పాద యాత్రతోపాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేశారని చెప్పారు. దేశ చరిత్రలోనే హామీలు పూర్తిగా నెరవేర్చిన ఏకైక సీఎం జగన్ అన్నారు. సంక్షేమ పథకాలను రాజకీయాలకతీతంగా అమలు చేస్తూ, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చుతున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు. అన్ని వర్గాల సంతోషం, సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. ఉన్నత కులాల్లోని నిరుపేదలకు సైతం ఆర్థిక సాయం అందిస్తున్నారన్నారు. అనంతరం గ్రామంలోని బీసీ హాస్టల్‌ను సందర్శించారు. హాస్టల్లో చదువుకునే విద్యార్థులందరికీ మెరుగైన వసతులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి, సర్పంచ్ యద్దనపూడి ఆనందజ్యోత్స్న, ఎంపీటీసీ సభ్యురాలు కర్ల రాధిక, వైఎస్సార్ సీపీ నాయకులు చింతా రవీంద్రనాథ్, మార్త శ్రీనివాసరావు, వేముల జీవరాజు, యద్దనపూడి విజయారావు, జాన్‌బాబు, జమలయ్య, నరసింహారావు, కర్ల రామకృష్ణ, మండల సమాఖ్య అధ్యక్షురాలు కంచర్ల పద్మావతి, వీఆర్వో శ్రీలక్ష్మీ, పంచాయతీ కార్యదర్శి మీర్జావలి, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గృహ సారథుల సేవలు ఎంతో కీలకం

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి గృహ సారథుల సేవలు ఎంతో కీలకమని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. చందర్లపాడులోని అలివేలమ్మ తల్లి ఫంక్షన్ హాల్లో శుక్రవారం గృహ సారథుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ముఖ్యంగా కేటాయించిన గృహాలపై అవగాహన కలిగి ఉండటంతో పాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, గృహ సారథులు సమన్వయంతో పని చేసి పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు.

గృహ సారథులే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయానికి రథ సారథులని శాసన మండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. కులమతాలు, పార్టీలు, రాజకీయాలకు తావు లేకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. గృహ సారథులు ఉత్తమ సేవలందించి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. గృహ సారథులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని నియోజకవర్గ పరిశీలకురాలు, ఆర్టీసీ రీజియన్ చైర్మన్ తాతినేని పద్మావతి పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో 175కు 175 సీట్లు లక్ష్యంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముందుకు వెళ్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పానికి అనుగుణంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, గృహ సారథులు పని చేయాలని కోరారు. అనంతరం గృహ సారథులకు మా నమ్మకం నువ్వే జగనన్న కిట్‌లు పంపిణీ చేశారు. ఎంపీపీ వేల్పుల ఏశమ్మ, సర్పంచ్ పున్నమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు ముక్కపాటి నరసింహారావు, నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, కందుల నాగేశ్వరరావు, వెలగపూడి వెంకటేశ్వరరావు, పలువురు నాయకులు, గృహ సారథులు పాల్గొన్నారు.

తువ్వ కాలువపై తూములు వేసి ఆక్రమణలు

చివరి భూములకు అందని సాగునీరు



కాలువలో నిండిన వ్యర్థాలు



కాలువపై ఏర్పాటు చేసిన తూములతో ఆక్రమణ

పెనుగంచిప్రోలు: మునేరు తువ్వ కాలువ కింద పెనుగంచిప్రోలు మండలంలోని పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు, ముచ్చింతాల, గుమ్మడిదూర్రు గ్రామాల్లో సుమారుగా 2 వేల ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. మునేరులో నీరు ఉంటే ప్రతి ఏడాది కాలువకు పుష్కలంగా నీరు వస్తుంది. అయితే కాలువకు పలు చోట్ల అనధికారంగా తూములు, కల్వర్టులు నిర్మించుకుని మామిడి తోటల యజమానులు వ్యాపారాలు చేసుకుంటున్నారు. కాలువలపై కల్వర్టుల నిర్మాణం వలన సాగు నీరు చివరి భూములకు అందటం లేదు.

కాలువలో పడేస్తున్న వ్యర్థాలు

తోటల యజమానులు మామిడి తోటల్లో భక్తులు వాడి పడేసిన ప్లాస్టిక్ డబ్బాలు, సీసాలు కాలువలో పడేయటంతో అవి కాలులో అడ్డుపడి నీరు కిందకు ప్రవహించటం లేదు. వీటి వల్ల పలు చోట్ల గండ్లు పడుతున్నాయి. అనిగండ్లపాడు దాటిన తరువాత కాలువలో నీరు రాక ఆయకట్టు రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. తోటల యజమానులు వారి స్వార్థం వారు చూసుకుంటున్నారు కానీ కాలువల్లో నీటి ప్రవాహాన్ని పట్టించుకోవటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. దీనిపై ఇరిగేషన్ అధికారులను వివరణ కోరగా తాము తోటల యజమానులను హెచ్చరిస్తున్నామని, తగు చర్యలు చేపడతామని చెబుతున్నారు.

శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు

జగ్గయ్యపేట: మహా శివరాత్రి సందర్భంగా జగ్గయ్యపేట ఆర్టీసీ డిపో నుంచి శ్రీశైలానికి ప్రతిరోజూ ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. శ్రీశైలం మల్లన్న దర్శనానికి జగ్గయ్యపేట, నందిగామ, కంచికచర్ల ప్రజల సౌకర్యార్థం బస్సు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఉదయం ఎనిమిది గంటలకు జగ్గయ్యపేట నుంచి బస్సు బయలుదేరుతుందన్నారు. స్వామి వారి దర్శనం టికెట్‌లు కూడా ఆర్టీసీ ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జలకళ పథకం ద్వారా ఉచితంగా బోరు



పనులు ప్రారంభిస్తున్నన వైస్ ఎంపీపీ మల్లికార్జునరావు

మోగులూరు(కంచికచర్ల): రైతుల సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు తెలిపారు. మండలంలోని మోగులూరు గ్రామంలో వైఎస్సార్ జలకళ ద్వారా శుక్రవారం బోరు పంపు వేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ రైతులు సాగు చేసుకునేందుకు జలకళ పథకం ద్వారా పొలాల్లో బోరు పంపును ఉచితంగా వేస్తున్నామని పేర్కొన్నారు. గ్రామంలో ఆరు బోరు పంపులు మంజూరయ్యాయని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సొసైటీ అధ్యక్షుడు బండి జానకి రామయ్య, నాయకులు షేక్ రసూల్, బండి శివ, రైతులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి

నందిగామ టౌన్: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. కార్యాలయంలో నాలుగు మండలాల ఎంపీడీవోలు, గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌లతో శుక్రవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందించటంతో పాటు సంచలనాత్మక నిర్ణయాలతో పాలన సాగిస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా ఆధార్ కార్డులో దొర్లిన తప్పుల వల్ల అర్హత ఉండి కూడా ప్రభుత్వ పథకాలు పొందని వారుంటున్నారని చెప్పారు. చిన్నచిన్న సాంకేతిక కారణాల వల్ల అర్హులు పథకాలకు అనర్హులవుతున్నారని తెలిపారు. గమనించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆధార్ కార్డులో సవరింపులకు అవకాశం కల్పించారని పేర్కొన్నారు. మండలానికి రెండు సచివాలయాల్లో ప్రభుత్వం ఆధార్ సవరింపులకు అనుమతించిందని తెలిపారు. అధికారులు, సిబ్బంది ఆధార్ సవరణల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి సవరింపులు చేయాలని సూచించారు. ఎంపీడీవోలు శ్రీనివాసరావు, బాలశంకరరావు, అరుంధతీ దేవి, డిజిటల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజ స్తంభ ప్రతిష్ఠ మహోత్సవం



దాసాంజనేయ స్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే



పెద్దాపురంలో దాసాంజనేయ స్వామి ఆలయంలో ధ్వజ స్తంభం ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు

పెద్దాపురం(కంచికచర్ల): వీరులపాడు మండలం పెద్దాపురం గ్రామంలో దాసాంజనేయ స్వామి నూతన ఆలయ నవీకరణ, స్వామి వారి విగ్రహ, జీవ ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా విష్వక్సేనారాధన, జీవధ్వజము, పుణ్యాహవచన, యంత్రములకు పంచామృత అభిషేకం వంటి పూజలు చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్‌రావు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ధ్వజ స్తంభం ఏర్పాటును తిలకించేందుకు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేశారు. సాయంత్రం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం హోమం జరిగింది. 20 వేల మంది భక్తులకు అన్న సమారాధన చేశారు. ఎంపీపీ కోటేరు లక్ష్మీ, ఏఎంసీ చైర్మన్ కోటేరు మల్లేశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకులు ఆవల రమేష్, కోటేరు ముత్తారెడ్డి, కోటేరు సూర్యనారాయణరెడ్డి, సత్యనారాయణరెడ్డి, వేముల ఆదాం, చింతా రవీంద్రనాథ్, మార్త శ్రీనివాసరావు, పసుపులేటి సాయిబాబు, బొమ్మిశెట్టి భాస్కరరావు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కంచికచర్లకు త్వరలో ప్రభుత్వ డిగ్రీ రెసిడెన్సీ కళాశాల



సర్పంచ్ సునీతకు ఆదేశాలిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు

కంచికచర్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దట్టంగా పెరిగిన కంపచెట్లను తొలగించే పనులకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఈ మేరకు ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణానికి త్వరలో ప్రభుత్వ డిగ్రీ రెసిడెన్సీ కళాశాల రానుందని చెప్పారు. ఇప్పటికే ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని పేర్కొన్నారు. కళాశాల ఆవరణలో దట్టంగా పెరిగిన కంపచెట్లను తొలగించాలని, అనంతరం నేషనల్ హైవే నుంచి కళాశాల వరకు రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లను తొలగించి సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని గ్రామ పంచాయతీ సర్పంచ్ వేల్పుల సునీతను ఆదేశించారు. రూ. 1.50 లక్షలతో గత పది రోజుల నుంచి కళాశాల ఆవరణలో పెరిగిన కంపచెట్లను తొలగిస్తున్నామని సర్పంచి సునీత ఎమ్మెల్యేకు తెలియజేసారు. జిల్లాలోనే ఆదర్శవంతమైన డిగ్రీ రెసిడెన్సీ కళాశాలగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే అన్నారు. ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, నాయకులు వేల్పుల శ్రీనివాసరావు, రమేష్, పంచాయతీ కార్యదర్శి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు సరైన వైద్యం అందించాలి

ఎంపీపీ మలక్‌బషీర్



భవనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ మలక్‌బషీర్

పెండ్యాల(కంచికచర్ల): ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వచ్చే రోగుల పట్ల ప్రేమగా ఉండాలని, చులకనగా మాట్లాడరాదని ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ తెలిపారు. మండలంలోని పెండ్యాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శుక్రవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈమేరకు ఎంపీపీ మాట్లాడుతూ ఆసుపత్రిలోనే కాన్పులు జరిగేలా చూడాలని , రోగులకు బీపీ, సుగర్, రక్త పరీక్షలు చేయాలని సూచించారు. అంతేకాకుండా ఉచితంగా మందులు అందజేయాలని చెప్పారు. నిత్యం పీహెచ్‌సీలో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు కూడా పీహెచ్‌సీలో చేయాలన్నారు. అనంతరం రికార్డులు, మందులు పరిశీలించారు. ఎంపీటీసీ సభ్యుడు షేక్ బడేహజరత్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు చాన్‌బహుదూర్, పీహెచ్‌సీ వైద్యురాలు జెస్సీ లిగింగ్ ఫెయిత్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అమర గాయకుల సంగీత సేవలు ఆదర్శం



విజయవాడ కల్చరల్: అమర గాయకుల సంగీత సేవలను ఆదర్శంగా తీసుకోవాలని శాతవాహన కళాశాల కరస్పాండెట్ నిడుమోలు రమాసత్యనారాయణ అన్నారు. సురభి ఆర్కెస్ట్రా ఆధ్వర్యాన గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళావేదికమీద శనివారం అమర గాయకుల స్ఫూర్తి సభ, తెలుగు హిందీ చిత్రగీత నివాళి కార్యక్రమం నిర్వహించారు. రమాసత్యనారాయణ మాట్లాడుతూ ఘంటసాల, బాలు లాంటి గాయకులు తెలుగు సినిమాలకు లభించిన అమూల్య ఆభరణాలన్నారు. సురభి ఆర్కెస్ట్రా వ్యవస్థాపకుడు ఉమాశంకర్ కామినేని సంస్థ లక్ష్యాలను వివరించారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు శింగంశెట్టి చంద్రశేఖర్ పరచూరి విజయలక్ష్మీ, ప్రసూనా రామన్, వడ్డాది కామేశ్వరి పాల్గొన్నారు. సీనియర్ గాయకుడు దండు చంద్రశేఖర్ ఆధ్వర్యాన మల్లాది స్వాతి, రూపా సత్యశ్రీ తెలుగు, హిందీ చిత్ర గీతాలను ఆలపించారు.

భగవంతుడిని మనస్ఫూర్తిగా ఆరాధించాలి

వేద పండితులు చాగంటి కోటేశ్వరరావు



ప్రవచనం చెబుతున్న చాగంటి కోటేశ్వరరావు

పెద్దాపురం(కంచికచర్ల): వీరులపాడు మండలం పెద్దాపురంలో దాసాంజనేయస్వామి వారి ఆలయ నవీకరణ, ధ్వజ స్తంభం ఏర్పాటు, ద్వారా పాలక మహోత్సవం శుక్రవారం జరిగింది. వేదపండితులు చాగంటి కోటేశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రవచనం చెప్పారు. దేవుడిని నమ్మిన వారికి ఎటువంటి అపాయం కలగదని చెప్పారు. భగవంతుడిని మనస్ఫూర్తిగా నమ్మాలని సూచించారు. ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు, ఎమ్మెల్సీ డాక్టర్ అరుణ్‌కుమార్, ఎంపీపీ కోటేరు లక్ష్మీ, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, ఏఎంసీ చైర్మన్ కోటేరు మల్లేశ్వరి, వైఎస్ ఎంపీపీ ఆదాం, నాయకులు కోటేరు ముత్తారెడ్డి, ఆవల రమేష్‌బాబు, బొమ్మిశెట్టి భాస్కరరావు, సూర్యనారాయణరెడ్డి, సత్యనారాయణరెడ్డి, పసుపులేటి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

నగర పంచాయతీ అభివృద్ధే లక్ష్యం



వార్షిక బడ్జెట్ వివరాలను తెలియపరుస్తున్న నగర పంచాయతీ సిబ్బంది

నందిగామ: నగర పంచాయతీ అభివృద్ధే లక్ష్యంగా కౌన్సిల్ పనిచేస్తున్నట్లు చైర్ పర్సన్ మండవ వరలక్ష్మి తెలిపారు. నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశ మందిరంలో శుక్రవారం సాయంత్రం 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ సమావేశం నిర్వహించారు. వార్షిక బడ్జెట్ కు సంబంధించిన వివరాలను కమిషనర్ డాక్టర్ జయరాం వివరించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధిలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే పట్టణంలో పలు అభివృద్ధి పనులు జరిగాయని, రాబోయే రోజుల్లో పట్టణాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దనట్లు పేర్కొన్నారు. కాగా బడ్జెట్ కు సంబంధించిన తీర్మానాన్ని కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. మొత్తం గ్రాంటులకు సంబంధించిన బడ్జెట్ రూ. 13.35 కోట్లు, మున్సిపల్ ఆదాయం రూ.9.49 కోట్లు, ఖర్చు రూ.8.53 కోట్లు, మిగులు రూ. 95.50 లక్షలు అని వెల్లడించారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు



నంబర్ ప్లేట్లు లేని వాహనాలు పరిశీలిస్తున్న పోలీసులు

నందిగామ: వాహన చోదకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఎస్‌హెచ్ఓ సతీష్ తెలిపారు. పట్టణంలోని గాంధీ సెంటర్‌లో శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. లైసెన్స్‌లు, వాహనాలకు నంబర్ ప్లేట్లు లేకుండా, అతి వేగంగా వెళుతున్న, ట్రిపుల్ రైడ్ చేస్తున్న, మైనర్లు నడుపుతున్న పలు వాహనాలు పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్స్ తో పాటు వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలను దగ్గర ఉంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని చెప్పారు. కొందరు మైనర్లకు వాహనాలు ఇస్తున్నారని ఆ విధంగా ఇవ్వడం వలన ప్రమాదాలు జరిగే అవకాశ ముందన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి వాహనానికి నంబర్ ప్లేట్ ఉండాలని లేదంటే సంబంధిత వాహనాలను సీజ్ చేస్తామని పేర్కొన్నారు. ఇదే క్రమంలో పలు వాహనాలు సీజ్ చేశారు. ఎస్ఐ పండుదొర, సిబ్బంది పాల్గొన్నారు.

ఆయిల్ కొలతల్లో తేడా వస్తే సహించం



పట్టణంలోని పెట్రోల్ బంక్ లో తనిఖీ చేస్తున్న అధికారులు

నందిగామ: పెట్రోల్ బంకుల నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని తహసీల్దార్ నరసింహారావు సూచించారు. పట్టణంలోని పలు పెట్రోలు బంకుల్లో తూనికలు, కొలతల శాఖ అధికారులతో కలిసి శుక్రవారం ఆయన తనిఖీలు నిర్వహించారు. బంకుల్లోని రికార్డులు, కొలతలకు సంబంధించిన లెక్కలు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు కొలతల ప్రకారం నాణ్యమైన పెట్రోల్, డీజిల్ అందజేయాలని ఆదేశించారు. ఫిర్యాదులు వస్తే ఉపేక్షించేది లేదన్నారు. ప్రతి రికార్డును తేడా లేకుండా సరి చూసుకోవాలన్నారు. తూనికలు కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ భాను ప్రసాద్, పౌర సరఫరాల శాఖ డీటీ రామ్మూర్తి రెడ్డి పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్కిల్ కమ్యూనికేషన్స్‌తో వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవచ్చని క్రిషి అసిస్టెంట్ మేనేజర్ నిమ్మగడ్డ నాగేశ్వరరావు అన్నారు. ఎన్టీఆర్ జిల్లా యువజన సర్వీసుల శాఖ, క్రిషి విజయవాడ ఆధ్వర్యంలో వన్‌టౌన్‌లోని గాంధీజీ మున్సిపల్ హైస్కూల్‌లో 9, 10 తరగతుల విద్యార్థులకు పర్సనాలిటీ డెవలప్‌మెంట్, కెరీర్ గైడెన్స్ అంశాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలో జరుగుతున్న విషయాలను తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో హైస్కూల్ విద్యార్థులతోపాటు జూనియర్, డిగ్రీ, పీజీ సెంటర్ల విద్యార్థినీ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా సైకాలజిస్టులు శ్రీపతి జగదీష్, తేజావతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గాంధీజీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు నీరజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.